25.06.2014

# జల సంపద జాతీయ పరిధిలోకి రావాలి. జల వినియోగంలో ప్రాంతీయ సమన్యాయం లక్ష్యంగా జల విధానాలు సవరించాలి

శ్రీ పాణ్యం సుబ్రహ్మణ్యం, విశ్రాంత సాగునీటి నిపుణులు, డా|| వై.వి. మల్లా రెడ్డి, డైరెక్టరు, ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటరు, అనంతపురము.

## 1.పరిచయముః

నీరు ప్రకృతి ప్రసాదములలో ముఖ్యమైనది, విలువైనది. సమస్త జీవకోటికి ఆధారమైనది. జీవకోటి మనుగడకు అవసరమైన మూల పదార్థాలలో ఒకటైన త్రాగు మరియు సాగు నీటి కోసం, విద్యుచ్ఛక్తి కోసం, ఆర్థికాభివృద్ధి కోసం, పారిశ్రామీకీకరణ కోసం, సామాజిక సంక్షేమం కోసం, ఈ నీరే మౌలికసోపానం. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి మూలాధారమైనది. దాదాపు 70 శాతం జనాభా గ్రామీణులు. వీరికి వ్యవసాయం ప్రధానమైన వృత్తి. వారి జీవనోపాధికి సోపానం నీటి లభ్యత. నీరెంతో అరుదైనది. అమూల్యమైనది. రానురాను నీరు మరింత అరుదైన వనరుగా మారుతున్నది. నీరు ప్రకృతిలో సమృద్ధిగా లభ్యమవుతుందనే భ్రమ కలుగుతుంది. కాని నిశితంగా పరిశీలిస్తే లభ్యమయ్యే నీటిలో కేవలం 0.5 శాతం మాత్రమే మానవ వినియోగానికి వీలవుతుంది. మిగతా 99.5 శాతం, సముద్రాలు, ఉత్తర-దక్షిణ ధృవాలు, మంచు కొండలలో వున్నవి. వర్షాలు కురవటంలో ఒకే సంవత్సరంలో హెచ్చు తగ్గులుంటాయి. వర్షాలు కురిసే ప్రాంతాలలో హెచ్చు తగ్గులుంటాయి. నీరు మనకు ఎక్కడ అవసరమైతే అక్కడ సహజంగా దొరకదు. అన్ని కాలాలలో లభ్యం కాదు. అవసరమైన అన్ని ప్రాంతాలకు, అవసరాలకనుగుణంగా, నీటి లభ్యతలో లోటు లేర్పడినప్పుడు, ఆ లోటును ప్రభుత్వాలు సవరించి తీర్చవలయును. నీటిని అందరి అవసరాలు తీర్చుటకు, ప్రాంతాల మధ్య అసమానతలు, విభేదాలు రాకుండా సమన్యాయం సాధించుటకు, సమగ్ర నీటి నిర్వహణ విధానాలు మరియు కార్యాచరణ అవసరము.

మన దేశానికి, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు, స్వతంత్ర భారతదేశంలో సుమారు 7 దశాబ్దాలు సుదీర్ఘ కాలం గడిచినా, త్రాగు నీటికి కూడా అలమటిస్తున్న ప్రాంతాలు ఉన్నాయి. తరతరాలుగా కనీస స్థాయిలో సాగు నీటి సౌకర్యం పొందని దుర్భిక్ష ప్రాంతాలు ఉన్నాయి. ఇటువంటి సమస్యలు దేశ వ్యాప్తంగా ఉన్నాయి. ఈ పరిస్థితికి అశాస్త్రీయ, అసమగ్ర జల విధానాలు, నీటి వినియోగంపై సమగ్ర ధృక్పధలోపంతో బాటు, ప్రభుత్వాల నిర్లక్ష్యం కూడా ముఖ్య కారణాలు. నీటి పంపిణీ వినియోగంలో, ముఖ్యంగా చారిత్రాత్మకంగా వివిధ ప్రాంతాలలో చోటు చేసుకున్న అసమానతల కారణంగా, వివిధ రాష్ట్రాల మధ్య, ఒకే రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మధ్య, జిల్లాల మధ్య, మండలాల మధ్య, గ్రామాల మధ్య, చివరకు కుటుంబాల మధ్య కూడా జలవివాదాలు రోజు రోజుకు పెరుగుతుండడం మనం చూస్తున్నాం. దినదినానికి పెరుగుతున్న నీటి అవసరాలు ఈ వివాదాలను మరింత ఉధృతం చేస్తున్నాయి. ఈ నాగరిక ప్రపంచంలో, దేశాభివృద్ధికి, జాతీయ సమైక్యతకు, మానవాభ్యుదయానికి ఈ వివాదాలు ఒక గొడ్డలి పెట్టు. మనమందరం విశాల ధృక్పధంతో, శాస్త్రీయ, సమగ్ర విధానంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నించకపోతే భావితరాలకు మనం సంక్రమింప చేసే ఈ దురవస్థ అన్ని స్థాయిలలోనూ జల వివాదాలు కాస్త జల యుద్ధాలుగా పరిణమించే అపాయం ఉంది.

## 2.పూర్వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నీటి వినియోగంలో ఏర్పడిన అసమానతలు ః

23 జిల్లాల సమగ్ర ఆంధ్రప్రదేశ్‌లో చెప్పుకోదగ్గ చిన్న, పెద్ద 40 నదులు ప్రవహిస్తున్నాయి. అందులో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగవళి ముఖ్యమైనవి. 75 శాతం ఆధారిత నదీజల పరిమాణం 2769 శతకోటి ఘనపుటడుగులు (శ.కో.ఘ. / టి.యం.సి). పై ఉపరితల నీటి (నదీజలాలు) లభ్యతతో బాటు సమారు 1140 శ.కో.ఘ అడుగుల భూగర్భజలాలు కూడా లభ్యమవుతున్నవి. గోదావరి నదిలో లభ్యమయ్యే 1480 టి.యం.సి.లలో ఇప్పటికి సమగ్ర రాష్ట్రం వినియోగిస్తున్నది కేవలం 720 టి.యం.సి.లు మాత్రమే. క్రిష్ణా నది నుండి అంచనా వేసిన 811 టి.యం.సి.లు పూర్తిగా వినియోగిస్తున్నాము. అయితే, గోదావరి నదీలోయ నుండి సుమారు 3000 టి.యం.సి.లు, కృష్ణానది లోయ నుండి సుమారు 1000 టి.యం.సి.లు మొత్తం 4000 టి.యం.సిలు. వృధాగా దాదాపు ప్రతి సంవత్సరం కూడా

బంగాళాంఖాతంలో చేరిపోవుతున్నవి. ఒక టి.యం.సి నీటితో, సుమారు 5000 ఎకరములలో వరిపైరు, లేక 10 వేల నుండి 12 వేల ఎకరములలో ఆరుతడి పైర్లు పండించవచ్చు.

మన పూర్వ రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో 23 జిల్లాల్లో మొత్తము వ్యవసాయ భూమి సుమారు 270 లక్షల ఎకరములు. లభ్యమయ్యే సాగు నీరు స్థూలంగా దాదాపు 3860 (భూగర్భజలాలతో కలసి) శతకోటి ఘనపుటడుగులు. ఒక శాస్త్రీయ పద్దతి పాటించి, సమనాయ్యం లక్ష్యంగా జల విధానాలను సవరించి నీటి పంపిణీ చేస్తే మన పూర్వ రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరు అందించవచ్చు. నీటి దుర్వినియోగం, వృధాను నివారించి, ఒక నిర్దిష్ట ప్రాధాన్యతా క్రమంలో జల పంపిణీ చేసి, అనుసంధాన నీటి వినియోగం (conjunctive water use), రక్షక తడులు లాంటి అధునిక వ్యవసాయ పద్దతులు పాటిస్తే రాష్ట్రంలో ఎక్కడా దుర్భిక్ష ప్రాంతాలు ఉండవు. ప్రాంతీయ అసమానతలు ఉండవు. అధునికి ప్రపంచంలో ఏ మూల, కరువు కాటకాలు ఉన్నా, అభివృద్ధికి నోచుకోకున్నా అవి మానవ సంస్కృతికే మచ్చ. మన జాతి గత చరిత్రను, భారత నాగరికతను ఒకసారి పరిశీలిస్తే, నీరు, నదులు ప్రజలను ప్రాంతాలను కలిపి ఏకం చేసినాయి. నీరు, నదుల ఆధారంగానే మానవాభ్యుదయం, నాగరికత అభివృద్ధి చెందింది. కానీ, ఈనాడు ఆ నీరు, నదులే నేడు కుటుంబాలను, ప్రాంతాలను, రాష్ట్రాలను విరోధులుగా విడదీస్తున్నది.

కనీసం 1000 మిల్లీలీటర్ల సగటు వర్షం అదనుకు పడితే వర్షధార వ్యవసాయం ఫలప్రదమవుతుంది. 800 మి. మీ. కంటే తక్కువ వర్షం పడే ప్రాంతాలలో వర్షాధార వ్యవసాయం కరువులకు గురై జూదంగా మారుతుంది. 1972 సం॥ ఇరిగేషన్ కమీషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం 1000 మి. మీ. కంటే తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాలలో, (ఒక బ్లాకు స్థాయిలో) వ్యవసాయ భూమిలో కనీసం 30 శాతం భూమికి నమ్మకమైన సాగు నీటి సౌకర్యం కల్పిస్తే తప్ప దుర్భిక్ష ప్రాంతాలకు మనుగడ లేదని స్పష్టంగా పేర్కొన్నది. ఒక బ్లాకు స్థాయిలో 30 శాతం అని చెప్పడానికి ముఖ్య కారణం, బ్లాకుల మధ్య, కూడా సగటు వర్షపాతంలో తేడాలుండటం, నీటి సాగులో తేడాలుండడం వలననే. విస్తృతంగా పరిశీలించిన పిమ్మట పూర్వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తరుచూ కరువుకు గురయ్యే దుర్భిక్ష ప్రాంతాలుగా 60 తాలుకాలను గుర్తించింది. అవి, 1. అనంతపురము జిల్లాలో 10 తాలూకాలు, 2. కర్నూలు జిల్లాలో 13 తాలూకాలు, 3. కడప జిల్లాలో 8 తాలూకాలు, 4. చిత్తూరు జిల్లాలో 7 తాలుకాలు, 5. మహబూబ్ నగర్ జిల్లాలో 10 తాలూకాలు, 6. నల్గొండ జిల్లాలో 7 తాలుకాలు, 7. రంగా రెడ్డి జిల్లాలో 4 తాలుకాలు తీవ్ర కరువుకు గురయ్యే తాలూకాలుగా తేల్చింది. అతి పెద్ద జిల్లాలైన మహబూబ్‌నగర్, అనంతపురము, నల్గొండ మరియు కర్నూలు జిల్లాలలో కరువు ప్రభావం ఎక్కువ. ఈ ప్రాంతాలలో వర్షపాతం చాలా తక్కువగా యుండగా, అనంతపురం జిలాల్లో అత్యల్పంగా సగటు వర్షపాతం కేవలం 550 మి.మీ. కల్గిన జిల్లాగా చరిత్ర కెక్కింది. ఈ అత్యల్ప వర్షపాతం కూడా చాలా అస్థిరమైనది, ఆపనమ్మకమైనది.

2004 సం॥ వరకు, ప్రభుత్వ గణాంక వివరాలను బట్టి, ఆంధ్రప్రాంతంలోని 9 జిల్లాల్లో 66.17 లక్షల ఎకరములకు అనగా వ్యవసాయ భూమిలో 69.50 శాతం సాగు నీటి సౌకర్యం పొందుతుండగా తెలంగాణా 9 జిల్లాలలో 27 శాతంతో, 46.57 లక్షల ఎకరములకు మరియు రాయలసీమ ప్రాంతంలోని 4 జిల్లాల్లో కేవలం 18.11 శాతంతో 17.93 లక్షల ఎకరములకు మాత్రమే సాగు నీటి సౌకర్యం కల్పించుటకు మౌలిక వసతులు ఏర్పడినవి. కానీ, దురదృష్టవశాత్తూ రాయలసీమకు సంబంధించి, నిర్దేశించిన సాగు నీటి ఆయకట్టులో కేవలం 50 శాతం మాత్రమే నీటి సాగులోనికి వచ్చుచున్నది. అనంతపురం జిల్లాలో 2004 సం॥ వరకు నీటి సాగు వసతి వున్నది కేవలం 3.5 లక్షల ఎకరములకు మాత్రమే. అనగా సాగు వసతి కేవలం 13.5% సాగు భూమికి మాత్రమే. ఇది కూడా స్థానిక వర్షపాతము పై ఆధారపడిన శ్రీకృష్ణ దేవరాయలు కాలం నుండి కట్టించిన చెరువులను, రైతులు త్రవ్వుకున్న బావులు, బోరు బావులు కూడా కలుపుకొని. ఈ ఆయకట్టులో వాస్తవంగా సాగు క్రింద పంటలు పండించుకుంటున్నది చాలా సంవత్సరాలలో కేవలం 2 లక్షల ఎకరములకు మించుట లేదు. ఎందుకంటే చెరువులు 5 సం॥ ఒక్కసారి కూడా నిండడము లేదు. భూగర్భజలాలు పూరించడం లేదు. అందుకే బోరు బావులు గాలిలో దీపాలైనాయి.

### 3.నీరు జాతీయ సంపదగా గుర్తించి, కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి తీసుకోవాలి. జల పంపిణీలో వినియోగ విధానాలలో ప్రాంతీయ సమన్యాయం, సామాజిక న్యాయం లక్ష్యాలుగా సమగ్ర మార్పు రావాలి.

సాగు నీటి రంగంలో నీటి కేటాయింపుల్లో ఈ అసమానతలు ఏర్పడుటకు ముఖ్యకారణం, అంతరాష్ట్ర నదీ జలాల పంపంకంలో అనుసరిస్తున్న సూత్రాలలో ముఖ్యమైనది, FIRST IN TIME FIRST IN RIGHT. అనగా ముందుగా కట్టిన ప్రాజెక్టుల హక్కులకు భంగం కల్గకుండా తర్వాత కట్టే ప్రాజెక్టులను చూడటం. ఈ సూత్రం ప్రాంతీయ సమన్యాయానికి విరుద్ధంగా వున్నది. వెనుకబడిన రాష్ట్రాలలోనూ, ప్రాంతాలలోనూ భారీ ప్రాజెక్టులు ముందుగా కట్టుకోలేక పోవటం, ఉన్న ప్రాజెక్టులు రాష్ట్ర సరిహద్దుల మార్పిడి కారణంగా వేరే ప్రాంతాలలో (తుంగభద్ర ప్రాజెక్టును కర్నాటకలో) చేర్చబడుట, భౌగోళిక పరిస్థితుల అనుకూలత, రాజకీయ నిర్లక్ష్యం వగైరా కారణాల ద్వారా కనీస నీటి కేటాయింపులు పొందజాలకున్నవి. సాగు నీటి సౌకర్యం తక్కువగా ఉన్న ప్రాంతాలు పారిశ్రామిక, ఆర్థిక, విద్య, వైద్య, సాంస్కృతిక రంగాలలో కూడా వెనుకబడి యుండటం గమనించ దగ్గ ముఖ్య అంశం. నీటి పంపిణీ విషయంలో ప్రాంతీయ సమన్యాయం, సామాజిక సమన్యాయం లక్ష్యాలుగా నెరవేరాలంటే, అనాదిగా అమలవుతున్న కాలం చెల్లిన అసంబద్ధ, అశాస్త్రీయమైన జల పంపిణీ మరియు వినియోగా విధానాలన సవరించుకోవలసిన తక్షణ అవసరం చాలా వుంది. ప్రతి వెనుకబడిన ప్రాంతము వ్యవసాయకంగా, పారిశ్రామికంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన కనీస నీటి పరిమాణ స్థాయిని హేతుబద్ధంగా గుర్తించాలి. రెండవ ప్రాధాన్యతగా గ్రామీణ జీవనోపాధులకు ముఖ్య ఆధారమైన వ్యవసాయానికి కనీసం 30 శాతం భూమికి నమ్మదగిన నీటి సాగు ఉండే విధంగా నీటి వసరాలు గుర్తించాలి. మూడవ ప్రాధాన్యతగా పారిశ్రామిక అవసరాలకు, విద్య, వైద్య ఇతర సంస్థల అవసరాలను గుర్తించాలి. నాల్గవ ప్రాధాన్యతగా పర్యావరణం, జీవవైవిధ్యం ఒక స్థాయిలో స్థిరంగా ఉండటానికి నీటి అవసరాలను గుర్తించాలి. ప్రాంతాలను బట్టి సమన్యాయం ప్రాతిపదికగా నీటి ప్రాధాన్యతాక్రమాలు మారవచ్చు. పై అవసరాలు కనీస స్థాయిలో తీరుటకు ఎంత నీరు అవసరమో గుర్తించి, ఇప్పటికే ఆ ప్రాంతాములో లభ్యమయ్యే నీటిని మినహాయించి, మిగిలిన నీటిని పొందడం ప్రజల హక్కుగా, సమకూర్చడం ప్రభుత్వ బాధ్యతగా పరిగణించాలి.

నీటి వినియోగ పద్ధతులలో కూడా హేతుబద్ధమైన సంస్కరణలను తీసుకొని రావాలి. అనుసంధాన నీటి వినియోగం ద్వారా కరువు పీడిత వర్షాధార పంటలకు "రక్షక తడులు" (protective irrigation) ఏర్పాటు చేసి కరువుల బారి నుండి రైతులను రక్షించవలసిన అవసరం చాలా వుంది. నీటి పంపిణీలో సామాజిక న్యాయం కావాలంటే, 80 శాతం పైగా వున్న వర్షాధార, సన్న చిన్న రైతులకు రక్షక తడుల అవకాశం కల్పించాలి. తద్వారా కరువు పీడిత ప్రాంతాలలో లక్షలాది ఒడుగు బలహీన రైతులకు కరువుల బారి నుండి రక్షణ ఏర్పడుతుంది. వర్షపు తడులు, భూగర్భజలాలు, స్థానిక ఉపరితల నీరు, నదీజలాలు అన్నింటినీ హేతుబద్ధంగా, అనుసంధానం చేసి, ఏ నీరు వృధా కాకుండా, వర్షాధార పంటలు, ఆరు తడి పంటలు రెండూ ప్రయోజనం పొందే విధంగా నీటి వినియోగం జరగాలి. అనుసంధాన నీటి వినియోగం యొక్క ముఖ్య లక్ష్యాలు 1. వర్షాధార పంటలను కరువులకు గురికాకుండా రక్షక తడులతో కాపాడడం. 2. భూగర్భజలాలను పూరించడం ద్వారా బోరుబావులను రక్షించడం, తద్వారా నీటిసాగు పంటలను రక్షించడం. నీటి లభ్యత మరియు ఆ ప్రాంత వ్యవసాయ-వాతావరణ పరిస్థితుల ఆధారంగా అనువైన పంటల సరళిని నిర్దేశించాలి.

ఇచ్చిపుచ్చుకొనే సుహృద్భావ ధోరణితో, అంతరాష్ట్ర, అంతర్‌జిల్లాల జలవివాదాలు పరిష్కరించుకోకపోతే, దేశం అంతటా తీవ్ర అలజడి, ఆందోళనలు, సాంఘిక వైషమ్యాలు, విచ్ఛిన్నకరపోకడలు బలంగా పుంజుకొంటాయి. పరిపాలన సమస్యగా మారి, రాష్ట్రాభివృద్ధితో బాటు దేశాభివృద్ధికి మరింత ఆటంకం కాగలవు. సవరించిన జలవిధానాల ద్వారా వెనుకబడ్డ ప్రాంతాలకు కనీస నీటి కేటాయింపులు చేసి సమన్యాయం చేసి తీరాలి. నీటి పంపిణీలో ప్రాంతీయ సమన్యాయం లక్ష్యంగా జలవిధానాలు రూపొంది, అమలుకు నోచుకోవాలంటే, నీటి వినియోగంలో అనుసంధాన నీటి వినియోగం (Conjunctive use of water) కరువు ప్రాంతాలలో వర్షాధార పంటలకు రక్షక తడులు (protective irrigation) లాంటి సంస్కరణలు, హేతుబద్ధమైన పంట విధానాలు రావాలంటే, నీటిని జాతీయ సంపదగా గుర్తించి రాష్ట్రాలకతీతంగా కేంద్ర ప్రభుత్వం పరిధి

తీసుకోవాలి. నీటితో పాటు జల విద్యుతుత్పాదన, కూడా కేంద్ర పరిధిలోకి తీసుకుంటే, వివాదాలు తగ్గి దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది.

నదీజలాల అభివృద్ధి రాష్ట్రాల పరిధిలో వుండుట వల్లనూ, నదీజలాల పంపిణీకి సంబంధించి నిర్ధష్టమైన ప్రాంతీయ ప్రాధాన్యతా క్రమము లేనందు వల్లనూ, రాష్ట్రాల స్థాయిలో ఆర్థిక వనరుల లేమివలననూ, రాష్ట్రాల మధ్య, ప్రాంతాల మధ్య పోటీ తత్వము, జల వివాదాలు ఉండడం వలననూ నదీ జలాల అభివృద్ధి బాగా కుంటుపడింది. ప్రాంతీయ అసమానతలు, వివాదాలు, ఉద్యమాలు పెట్రేగి, సమతల అభివృద్ధికి తీవ్ర అవరోధంగా వున్నది.

*<u>ముగింపు :</u>*

నదీ జలాలను జాతీయ సంపదగా పరిగణించి కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో సద్వినియోగ పరుచుకోవాలి. దేశంలో ఆర్థికాభివృద్ధికి, మానవాభివృద్ధికి పునాదులు గ్రామీణ భారతంలో వుండాలి. వ్యవసాయము గ్రామీణ జీవనోపాధులు, దేశాభివృద్ధికి చోదక శక్తులుగా తీర్చిదిద్దాలి. ప్రస్తుత మరియు భవిష్యత్తు తరాల జల అవసరాలు తీర్చడానికి, ప్రాంతీయ సమన్యాయం సాధించడానికి నదుల అనుసంధానమే ముందున్న ఏకైక పరిష్కార మార్గం. కరువు సమస్యకు వ్యవసాయాభివృద్ధికి, ఆహార భద్రతకు, పారిశ్రామికాభివృద్ధి, మరియు దేశ సర్వతోముఖాభివృద్ధికి శాశ్వత పునాది నదుల అనుసంధానం.

ఏ నదీ జలాలైనా ఆ నదీ పరీవాహక ప్రాంతంలో సమన్యాయం ప్రాతిపదికగా అవసరమైన మేర వినియోగించుకున్న తరువాత, మిగులు నీటిని, నీటి లభ్యత తక్కువైన ప్రాంతాలకు మళ్లించాలి. సాధ్యమైనంతవరకు పర్యావరణానికి భంగం కలుగని రీతిలో జలాశయాల నిర్మాణం జరగాలి. జనాభా పెరిగే కొద్దీ ఎదురయ్యే నీటి సమస్యను అధిగమించడానికి లభ్యత అధికంగా ఉన్న ప్రాంతాల నుండి అల్ప వర్షపాతం కల్గిన ప్రాంతాలకు సమన్యాయం ప్రాతిపదికగా అవసరాలను బట్టి, అత్యంత ప్రాధాన్యత కల్పించి నీటిని తరలించే విధంగా నిర్దిష్టంగా జాతీయ జల విధానాలు ఉండాలి. ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి నీటి వాలు పారుదల పద్దతిలో గాని, ఎత్తిపోతల పద్దతిలో గాని రవాణా చేయటం తప్పని సరి అవుతుంది. సాగు నీటి నిర్వహణలో రైతులకు అర్థవంతమైన భాగస్వామ్యాన్ని కల్పించాలి.

గోదావరి జలాలను సాధ్యమైనంత వరకు కృష్ణా నది ప్రాంతం దిగువనున్న అన్ని ప్రాజెక్టుల అవసరాలకు తీర్చుటకు ఉపయోగించవలయును. అందుకనుగుణంగా చేపట్టిన, పోలవరం ప్రాజెక్టు, పులిచింతల, నాగార్జున సాగర్ టైలుపాండు, దుమ్మగూడెం ప్రాజెక్టులు సత్వరమే పూర్తి చేయాలి. అలా ఆదా చేసిన నీటిని కృష్ణా నదిపై ఎగువనున్న ప్రాంతాలకు, సమన్యాయం ప్రాతిపదికగా కనీస సాగు నీటి వసతి, త్రాగు నీటి వసతి కల్పించుటకు హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి, తెలుగు గంగ, వెలుగొండ, భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయించాలి. ఈ ప్రక్రియంతా సాఫీగా జరగాలంటే జల వనరులు కేంద్ర పరిధిలోనికి తీసుకు రావాలి. నీటి పంపిణీ ప్రాధాన్యతలపై నిర్దిష్టమైన విధి విధానాలు ఉండాలి.

వర్షాభావంతో పంటలకు స్థిరమైన నీటి వసతి కరువైన పరిస్థితులలో అందుబాటులో ఉన్న నీటిని శాస్త్రీయంగా "అనుసంధాన నీటి వినియోగం" (conjunctive water use) ద్వారా వృధాకాకుండా ఉపయోగించుకోవల్సి ఉంది. వృధాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కూడా పర్యావరణానికి భంగము కలుగకుండా నిల్వ చేసి, సాగు నీరు, త్రాగునీరు, పారిశ్రామిక, పర్యాటక మొదలగు ఇతర అవసరాలకు వాడుకోవాల్సి ఉంది. నదులలోని జీవ జలాలను పూర్తిగా వినియోగించుకునేలా పటిష్ఠమైన చర్యలు చేపట్టాల్సి వుంది. అయితే పర్యావరణ పరిరక్షణకు భంగం వాటిల్లకుండా ఆశయాలు సాధించాలి.